క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



ఊట్కూర్: మండలంలోని మొగ్దుంపూర్‌లో పలు అభివృద్ధి పనులకు భూమి నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ వాడలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 2 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టగా స్థానిక నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్, లింగం, కోరం మహేశ్ రెడ్డి, కొక్కు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'రుద్ర వీరభద్ర' పాట విడుదల



మక్తల్: ఐరావత్ సినీ కలర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మితమైన హరికథ సినిమాలోని రుద్ర వీరభద్ర పాటను ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. మక్తల్‌కు చెందిన అనుదీప్‌రెడ్డి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందగా నిర్మాతలుగా రంజిత్‌గౌడ్, వివేకనంద, రాఘవేందర్, కవిత వ్యవహరించారు. ఇక మక్తల్‌కు చెందిన కిరణ్, రంజిత్, సజ్జన్, అఖిల్‌రామ్, లావణ్య, అశోక్, రాంపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఈ సినిమాలో నటించారు. ఈ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది.

ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్‌గా ఎంపిక

ధన్వాడ: సమగ్ర శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలను శనివారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో కొండాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు ఉద్యోగాలు సాధించారు.గ్రామానికి చెందిన నవీన,అశ్విని రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల యువతుల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



కోస్గి రూరల్: ఆధునిక దళిత కవి గుర్రం జాషువా 130వ జయంతిని ప్రజా ఉద్యమ నాయకుడు గౌరగాళ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గుండుమాల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ, గణేష్, సిద్ధన్న, కొండన్న, దస్తయ్య పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం' అమలు చేయాలి

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిన్నహన్మంతు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకానికి దీటుగా అంబేడ్కర్ అభయహస్తం అమలుచేస్తామని తీరా రెండేళ్లు కావొస్తున్నా అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. అలాగే నిరుద్యోగులకు ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి రుణాలు మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం అభయహస్తం అమలు చేసి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతి కాలనీలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గోవింద్‌గేరి లక్ష్మీకాంత్, గౌరవ అధ్యక్షుడుగా వెంకట్రామి రెడ్డి, కార్యదర్శిగా శివారెడ్డి, ఉపాధ్యక్షుడుగా గుట్టమీది నారాయణ, తిరుపతయ్య, కోశాధికారిగా రుద్రారెడ్డి, సభ్యులుగా నారాయణ, గోపాల్, రామకృష్ణ రెడ్డి, మల్లి ఖార్జున్, సలహా దారులుగా సుతారి సత్య, రఘుపాల్, బాపన్‌పల్లి శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, ఆంజనేయులు, సురేష్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎక్సైజ్ ఎస్ఐకు ఎంపిక

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన మనోహర్ సత్తా చాటాడు. ఆదివారం విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికై కన్నవారి కలలను నిజం చేశాడు. గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మన్న, ఇంద్రమ్మ కుమారుడు మనోహర్ ఆరేళ్లుగా గద్వాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే గ్రూప్–2పై ఇష్టంతో పట్టుదలతో చదివి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. దీంతో తల్లిదండ్రులతో పాటు సీపీఎం, సీపీఐ నాయకులు బుచ్చన్న, రాజు మనోహర్‌ను అభినందించారు.

పండుగ మాటున.. కల్తీ పంజా!



కారం పొడి



వంట నూనె

- మార్కెట్‌లోకి విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- దసరా వేళ ప్రజలు జాగ్రత

మరికల్: పండగలు వస్తే చాలు కొందరు వ్యాపారులు నకిలీ సరుకులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పప్పు, పాలు, పసుపు, పిండి, నూనె, కారం లేనిదే రోజు గడవదు. ఇక పండగలు అంటే చెప్పనవసరం లేదు. ఇక దసరా వచ్చిందంటే రకరకాల వంటకాలతో ప్రతి ఇల్లు ఘుమఘుమలాడుతుంది. అయితే వాటి మాటునే కల్తీ ప్రమాదమూ పొంచి ఉండే అవకాశం ఉంది. వినియోగదారుల అవసరాలను ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు కల్తీ ఆహార పదార్థాలను అంటగడుతుంటారు. అయితే కొన్ని జాగ్రత్తలతో కల్తీ పదార్థాలను కనిపెట్టొచ్చంటున్నారు నిపుణులు.

పప్పును గుర్తించండి ఇలా..

వినియోగదారుల కళ్లు మెరిసేలా కొందరు వ్యాపారులు కంది, పెసర, మినుము లాంటి పప్పు దినుసులకు నూనె పూస్తుంటారు. కేసరి పప్పునకు మెటానిల్ ఎల్లో రంగు కలుపుతుంటారు. కేసరి పప్పును భూతద్దం సాయంతో గుర్తించవచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా పప్పును తీసుకొని నీటిని కలపాలి. వాటికి 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులోకి మారితే అది కల్తీ అయినట్లు లెక్క.

గంజిపొడి.. బియ్యం పిండి..

తెల్లగా ఉండే గోధుమ పిండిలో గంజి పొడి, బియ్యం పిండి, సుద్దపొడి కలిపే ప్రమాదముంది. దీన్ని గుర్తించాలంటే కొద్దిగా గోధుమ పిండిని పరీక్ష నాళికలో తీసుకొని 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలిపితే దట్టమైన పొగలు వస్తున్నాయంటే అది కల్తీ అయినట్లే. తూకంలో ఎక్కువ బరువు వచ్చేందుకు గోధుమ, ఇతర పిండిలలో సుద్దపొడి వాడుతుంటారు.

మిరప పొడిలో..

మిరప పొడిలో ఎరుపురంగు ఇటుక పొడి వంటి వాటిని ఉపయోగించి కల్తీ చేస్తారు. మిరప పొడిని కొద్దిగా తీసుకొని నీటిలో వేసినప్పుడు ఇటుక పొడి నీటి అడుగున చేరుతుంది. రంగు సైతం మారిపోతుందంటే అనుమానించాల్సిందే.

నూనె రంగు మారుతోంది..

కల్తీ నూనెను కనిపెట్టాలంటే.. పరీక్ష నాళికలో కొద్దిగా నూనె తీసుకుని 5 మి.లీ. గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం కాస్త చక్కెర కలిపితే అడుగున గులాబీ లేదా ఎరుపు రంగు ఏర్పడుతుంది. అలా ఏర్పడితే అది నాసిరకం అని భావించాలి. ఇలా ప్రతి ఆహార పదార్థాల్లో నకిలీ వ్యాపారులు కల్తీ చేసి వినియోగదారులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంటారు. అలాంటి వాటిని గుర్తించి, నమ్మకమైన వాటితో పండగ సరుకులను కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



పసుపు

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి

మాగనూర్: మండలంలోని నేరడగండొడ్డి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు ఉండడంతో వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారడం, గుంతలు ఏర్పడడంతో వాహనాలు కూడా తమ గ్రామాలకు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిత్యం మాగనూర్ మండల కేంద్రానికి వస్తుంటారు. గ్రామానికి ఆటోలు కూడా రాకపోవడంతో ఎక్కడికి వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదని పేర్కొంటున్నారు. గతంలో కొంత మేర బీటీ రోడ్డు వేసి వదిలేశారని మిగిలిన పనులు ప్రారంభిస్తామని చెబుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామాలకు బీటీ రోడ్లు వేసి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా నేరడగండొడ్డి రోడ్డు

జిల్లా సదస్సును విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన జిల్లా సదస్సును విజయవంతం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి కోరారు. ఈ మేరకు మండలంలోని కోటకొండ, అబంగాపూర్ గ్రామాల్లో ఆదివారం సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కలిసి సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. బీజేపీ విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, కనీస మద్దతు ధరలు ఎక్కడ అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 60 లక్షల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయని వారికి సరైన ప్రోత్సాకాలు అందడం లేదన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించి, పత్తి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరుకు జిల్లా కేంద్రంలోని మెట్రో ఫంక్షన్ హాల్లో సదస్సు జరుగుతుందని రైతులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, నారాయణ, ప్రతాప్, సలీం, ఇస్మాయిల్, నరసింహ, వెంకటప్ప, భగవంతు, దస్తప్ప, రామచందర్, అంజి, నరసింహులు పాల్గొన్నారు.



కోటకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు..

కుంటను తలపిస్తున్న అంతర్రాష్ట్ర రహదారి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం మీదుగా కర్ణాటకకు కలుపుతూ ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలమయమైన రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలవడంతో కుంటను తలపిస్తుంది. పట్టణం నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరం వరకు రాష్ట్రం విస్తరించి ఉంది. ఈ రోడ్డు మీదుగానే కర్ణాటక లోని యాదగిర్ జిల్లాకు వెళ్తుంటారు. జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ లేకపోవడంతో చాలా మంది ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లే వారు సైదాపూర్ స్టేషన్‌కు వెళ్తుంటారు. వ్యాపార నిమిత్తం కర్ణాటక ప్రజలు సైతం ఈ రోడ్డు మార్గంలోనే జిల్లా కేంద్రానికి వస్తుంటారు. అయినా ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టడం లేదు. ఈ దుస్థితి చూసైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



గుంతల్లో నీరు నిలిచి మడుగులా తయారైన రహదారి

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ కార్యాలయాల్లో నడుస్తున్న అద్దె వాహనాలకు ఇవ్వాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని అద్దె వాహనాల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుగౌడ్ అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో జరిగిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రఘుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కవీరం, ఉపాధ్యక్షుడిగా ధర్మానాయక్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ.. వివిధ శాఖల్లో జిల్లా అధికారులకు నడుస్తున్న వాహనాలకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు రాకపోవడంతో వాహనాల కిస్తులు చెల్లించలేకపోతున్నామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

సూచిక బోర్డు లేక.. దారి తెలియక



మండలంలోని మందిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మలుపు సమీపంలో వ్యవసాయ బావులు కూడా ఉన్నాయని, రాత్రి వేళ అదుపు తప్పి బావిలో పడితే ప్రాణనష్టం తప్పదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై గతంలోనే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. – మాగనూర్

రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలి

మరికల్: వర్షాలకు పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు రాము, దేవాదాస్, వెంకటయ్య కోరారు. మరికల్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేల పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొండయ్య, వెంకటయ్య, యాదయ్యలు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్

మద్దూరు: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దూరులోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు పశువైద్యాధికారిణి డాక్టర్ సబిత టీకాలు వేశారు. 25 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసినట్లు ఆమె తెలిపారు. ఇంకా ఎవరైన పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించుకోక పోతే వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏ దేవేందర్, యుద్ధంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంఘ్ పరివార్‌తో భారత్ సంఘటితం

దామరగిద్ద: సంఘ్ పరివార్ సంఘటితం కావడంతోనే మన దేశం, ధర్మం, సంస్కృతి సంప్రదాయాలు రక్షించబడుతున్నాయని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ యాదిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన దామరగిద్ద భవాని ఆలయ ఆవరణలో ఖండ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శత జయంతి సందర్భంగా విజయదశమి ఉత్సవాలను నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సంపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణం దేశభక్తి కలిగిన యువతరాన్ని తీర్చి దిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. అంతకుముందు ఆర్ఎస్ఎస్ ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం భారత మాత, గురీజీల చిత్రపటాలకు, శమి వృక్షానికి పూజలు నిర్వహించారు.

మర్రికుంట చెరువుకు గండి



కొత్తపల్లి: మండలంలో భూనీడు శివారులోని మర్రికుంట చెరువు తూము దగ్గర గండి పడింది. ఇంకొక రెండు రోజులు ముసురు వర్షం కురిస్తే కట్ట కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద దాదాపు 100 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గండి పడిన చెరువు నుంచి నీరు ఊటలా బయటకు వస్తుందని సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువుకు పడిన గండిని పూడ్చి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నేతలు

నారాయణపేట రూరల్: దేశ ప్రధాని మోదీ ప్రజలతో ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణ బీజేపీ నాయకులు వీక్షించారు. పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ నివాసంలో మాజీ కౌన్సిలర్ బాలాజీ మాంద్రే, పట్టణ బీజేపీ అధ్యక్షుడు పోషల్ వినోద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందు, ప్రధాన కార్యదర్శి దత్తు, నాయకులు ప్రభంజన్, కిరణ్, మోగులప్ప, సూర్యకాంత్, కుమారస్వామి తదితర నాయకులు టీవీలో వీక్షించారు.

మహాచండిగా అమ్మవారి దర్శనం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తుల పూజలు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామ శ్రీగిరి పీఠంపై భవానిమాత ఆలయంలో మహాచండి దేవిగా, కోటకొండ వాసవిమాత ఆలయంలో కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరించారు. భక్తులకు సర్వదర్శనం అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పట్టణంలోని అర్చకులు మాణిక్ శాస్త్రి స్వగృహంలో వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, మహా అలంకరణ, అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారికి మహామంగళ హారతి సమర్పించారు.

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారు ఎస్ఎస్‌కే సమాజ్ భవాని ఆలయంలో శ్రీ రాముడుగా, శక్తిపీఠంలో మహాలక్ష్మీ దేవిగా, బ్రహ్మస్‌వాడీ చౌడేశ్వరీ మాత ఆలయంలో లలిత త్రిపుర సుందరి దేవిగా, మలలాంబిక దేవాలయంలో శ్రీశైల భ్రమరాంబిక దేవిగా, వైష్ణోదేవి ఆలయంలో శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు.

అమ్మవారి సేవలో నటి

జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మత మూల మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో తెలుగు నటి శ్రీమతి లిరీషా పాల్గొన్నారు. ఆదివారం మహా లక్ష్మీదేవి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని సూక్త హోమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. తదనంతర మహానివేదన సమర్పణ చేసి మంగళహారతి అందించారు.

మరికల్: మండలంలో అమ్మవారం భక్తులకు ఆదివారం మహాచండీ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరణాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఊట్కూర్: మండలంలో బిజ్వార్‌లోని అంబాత్రయ క్షేత్రంలో శత చండి యాగం, 108 కళశాలతో అమ్మవారికి అభిషేకాలు, అష్టోతర శతనామావలి, కుంకుమార్చన నిర్వహించారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని మారుతీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని లలిత త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. అలాగే గంగదేవి ఆలయం, వీరభద్రేశ్వరస్వామి దేవాలయం, అంబాభవాని ఆలయంలో మహచండిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మద్దూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు.



నారాయణపేటలో...



మరికల్‌లో మహాచండి అవతారంలో అమ్మవారు



శ్రీగిరి పీఠంపై మహచండి దేవిగా అమ్మవారు

ఘనంగా బతుకమ్మ వేడుకలు



మక్తల్‌లో బతుకమ్మను తయారు చేసుకొని వెళ్తున్న మహిళలు



బతుకమ్మలతో అక్క మహాదేవి మహిళ సంఘం

కోస్గి రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా పట్టణంలోని బసవేశ్వర భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని మహచండి గౌరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వీరశైవ సమాజంలోని అక్క మహదేవి మహిళ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ తయారు చేసి ఆటపాటలతో సందడి చేశారు. తర్వాత మండల పరిధిలోని సర్జఖాన్‌పేట్ గ్రామంలో దండం చేరువులో నిమజ్జనం చేశారు.

మార్కెట్ యార్డుల్లో బతుకమ్మ సంబరాలు

మక్తల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. వేడుకల అనంతరం మక్తల్ చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గవినోళ్ల రాధమ్మ,వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం



మక్తల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేటటౌన్/నారాయణపేట రూరల్/దామరగిద్ద: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు నరహరి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆ యన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణ,శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘననివాళి

మక్తల్: పట్టణంలో నారాయణపేట క్రాస్ రోడ్డులో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ సంఘం, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన వ్యక్తి భగత్‌సింగ్ అని ఆయన త్యాగాలను కొనియాడారు. అంబేడ్కర్, సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్,ప్రధాన కార్యదర్శి కృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఊట్కూర్: మండలంలోని బిజ్వార్ గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ 118 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పీడీఎస్‌యూ, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు శివ, మహేశ్‌గౌడ్, అశోక్, సిద్ధు, కోర్ల నిర్సిములు, గోవిందు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఆత్మకూర్: హిందూసంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పోలీసులు ఉద్దేశపూర్వకంగా బీజేపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై సీఐ శివకుమార్‌తో వివరాలను తెలుసుకున్నారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీ వినాయక నిమజ్జనం సందర్భంగా ఇతర వర్గానికి చెందిన వారు జెండాలు కట్టడంవల్ల అన్నిపార్టీలకు చెందిన హిందు సంఘాలన్నీ నిరసన చేపట్టామన్నారు. పోలీసులు కేవలం బీజేపీ కార్యకర్తలను మాత్రమే టార్గెట్‌చేసి కేసులను నమోదు చేయడమేమిటని ప్రశ్నించారు. నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు అశోక్‌జీ, నంబిరాజు, అశోక్‌భూపాల్, లావణ్య, ఆంజనేయులు, హరీష్, మనోహర్‌గౌడ్, తమ్మలివిజయ్, సూరి, ఆనంద్, ఎల్లన్న, రాఘవేందర్, సహదేవ్, అశోక్‌నంద తదితరులు ఉన్నారు.